



సకల శుభాలు కలగాలి

నేతల వినాయక చవితి శుభాకాంక్షలు

వినాయక చవితి పండుగ జరుపుకుంటున్న రాష్ట్ర ప్రజలకు పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళని స్వామి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల జీవితాల్లో కష్టాలు తొలిగి సుఖాలు కలగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఈపీఎస్ తన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, మాజీముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే.వాసన్, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, సీనియర్ నాయకురాలు తమిళిసై, తమిళనాడు బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పెరుంతలైవర్ మక్కల్ కట్చి అధ్యక్షుడు ఎన్ఆర్.ధనపాలన్ సహా పలు పార్టీల నేతలు ప్రజలకు వేర్వేరు ప్రకటనలో వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి

రామేశ్వరం ఎయిర్‌పోర్ట్ కోసం స్థల పరిశీలన



ప్యారీస్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరంలో కొత్త ఎయిర్‌పోర్టు కోసం ప్రభుత్వ అధికారులు స్థల పరిశీలన ప్రారంభించారు. ఈ జిల్లాలోని రామనాథస్వామి ఆలయం, దనుష్కోడి, హరిచ్చల్‌మునై తదితర పర్యాటక ప్రాంతాలకు ప్రపంచం నలుమూలల నుండి పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. వీరు రోడ్డుమార్గం, రైళ్లలో రామేశ్వరం వెళ్లేందుకు ఎక్కువ సమయం పడుతోంది. రామనాథపురంలో ఉత్పత్తి అవుతున్న సీఫుడ్, ఉప్పు విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. వాణిజ్యపరంగా ఈ జిల్లా అభివృద్ధి చెందుతున్నప్పటికీ విమానసేవలు అందుబాటులో లేవు. ఈ సమస్యపై దృష్టిసారించిన రాష్ట్రప్రభుత్వం విమానాశ్రయం ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించింది. విమానాశ్రయం కోసం రామనాథపురం జిల్లాలో 500-700ల ఎకరాల స్థలం ఉన్న 5 ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. రామనాథపురం మండలంలోని పలంగుళం, దేవీపట్నం, కుంబరం, కీల్‌కరై మండలంలో ఉన్న కళరి, మానికనేరి ప్రాంతాలను పరిశీలించి వీటిలో విమానాశ్రయానికి అనుకూలంగా ఉండే ఒక ప్రాంతాన్ని ఎంపిక చేయాల్సిందిగా ఇండియా ఎయిర్‌పోర్టు అథారిటీకి నివేదిక పంపించింది. దీనిపై రామనాథపురం జిల్లా అధికారులు మాట్లాడుతూ, విమానాశ్రయం ఏర్పాటుకు అనువైన స్థలం సేకరించడం శ్రమతో కూడిన పని అని అయినప్పటికీ తమిళనాడు పరిశ్రమల అభివృద్ధి సంస్థ (టిడ్కో) అధికారులతో కలిసి ఐదు ప్రాంతాలను పరిశీలించామని, వాటిలో ప్రభుత్వానికి చెందిన స్థల విస్తీర్ణం అధికంగా ఉందన్నారు. సాధ్యమైనంత వరకు ఆ స్థలంలోనే విమానాశ్రయం ఏర్పడే అవకాశముందని అభిప్రాయపడ్డారు.

బడిపిల్లల ఆకలి తీర్చే అల్పాహార పథకం

● సీఎం స్టాలిన్



పంజాబ్ సీఎం భగవంత్‌మాన్‌తో కలిసి బడిపిల్లలకు అల్పాహారం వడ్డిస్తున్న ముఖ్యమంతి ఎంకే స్టాలిన్

● వ్యయ భారం కాదు... సామాజిక పెట్టుబడి

● సబర్బన్ ప్రాంతాల్లో విస్తరణకు శ్రీకారం



బడిపిల్లలతోపాటు కూర్చుని అల్పాహారం తింటూ కబుర్లాడుతున్న ఇరు రాష్ట్రాల సీఎంలు

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ తరహా పాలన అందిస్తున్న డీఎంకే ప్రభుత్వం బడిపిల్లలకు అల్పాహార పథకం అమలు చేసి ఆ చిన్నారుల ఆకలిదప్పులు తీర్చామని, ప్రతియేటా ఈ పథకానికి అయ్యే రూ.600కోట్ల ఖర్చును సామాజిక పెట్టుబడిగా భావిస్తున్నామని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మైలాపూర్‌లోని సెయింట్ జోసెఫ్ ప్రాథమిక పాఠశాలలో ఉదయం పూట ఉచిత అల్పాహార పథకం విస్తరణను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వీరిద్దరూ కలిసి బడిపిల్లలకు అల్పాహారం వడ్డించి, ఆ తర్వాత పిల్లలతో కలిసి కూర్చుని అల్పాహారం సేవించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్టాలిన్ మాట్లాడుతూ ఉదయం పూట చిన్నారులతో కలిసి అల్పాహారం తినగానే ఆ పిల్లల్లాగే తనలోనూ ఎనర్జీ పుట్టుకొస్తోందన్నారు. సబర్బన్ ప్రాంతాల్లో ఈ పథకాన్ని విస్తరించిన తర్వాత రాష్ట్రంలో రోజుకు 20.59లక్షల మంది ఉదయం పూట అల్పాహారం తీసుకుని సక్రమంగా పాఠాలు నేర్చుకుంటారనే నమ్మకం తనకుందని చెప్పారు. ఈ పథకం విస్తరణ కార్యక్రమానికి పంజాబ్ సీఎం భగవంత్ మాన్ రావడం తనకెంతో ఆనందంగా ఉందని, బిజీగా ఉన్న ఆయన తమ ఆహ్వానం అందుకుని రావటం బడిపిల్లలపై ఆయనకున్న ప్రేమాభిమానాలకు నిదర్శనమని కొనియాడారు. రాష్ట్రంలో పుదుమైపెణ్ పథకం ప్రారంభోత్సవానికి ఢిల్లీ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విచ్చేశారని, ప్రస్తుతం అల్పాహార పథకం విస్తరణ కార్యక్రమానికి పంజాబ్ సీఎం భగవంత్ మాన్ హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. ఆకలిమంటలు, అనారోగ్యం లేని రాష్ట్రమే అత్యుత్తమమనే పేరు తెచ్చుకుంటుందని, ఆ ప్రకారమే తమ ప్రభుత్వం బడిపిల్లలకు అల్పాహారం అందించామని, ఫలితంగా పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ పాలనలో మధ్యాహ్న భోజన పథకం అమలయ్యిందని, ఆ తర్వాత ఆ పథకం పౌష్టికాహార పథకంగా మార్చింది మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి అని గుర్తు చేశారు. ఈ పథకం లాగే అన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే తన ప్రధాన లక్ష్యమని స్టాలిన్ అన్నారు.

ఇదొక కొత్త పథకం... : పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ మాట్లాడుతూ బడిపిల్లల అల్పాహార పథకం విప్లవాత్మకమైన పథకమని, ఈ పథకం దేశానికే ఆదర్శవంతమైనదన్నారు. ఆకలి లేకుండా బడిపిల్లలు చక్కగా చదువుతారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారన్నారు. మీరంతా హ్యాపీగా ఉన్నారా అని ఆయన ఆంగ్లంలో బడిపిల్లలను ప్రశ్నించగా, చాలా హ్యాపీగా ఉన్నామని బదులిచ్చారు. ఈ పథకాన్ని పంజాబ్‌లోనే అమలు చేయడానికి తక్షణ చర్యలు ప్రారంభిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ పిల్లలకు చాక్లెట్లు పంచిపెట్టి వారితో కబుర్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు గీతా జీవన్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, సీపీఐ నేత ముత్తరసన్, ఎంపీ కనిమొళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ఎంఎస్ స్వామినాదన్ ట్రస్టు డైరెక్టర్ డాక్టర్ సౌమ్యా స్వామినాదన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయడంలేదు...!

● స్పీకర్ అప్పావు



పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయడం లేదని,జస్టిస్ సుదర్శన రెడ్డి విజయం సాధిస్తే మాత్రమే పార్లమెంటు ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేస్తుందని స్పీకర్ అప్పావు అభిప్రాయం వ్యక్తం చేశారు. తిరునల్వేలిలో మంగళవారం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ... సమగ్ర శిక్షా అభియాన్ పథకంలో రాష్ట్రానికి రావాల్సిన రూ.2వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి ఇండియా కూటమి తరపున పోటీచేస్తున్న జస్టిస్ సుదర్శన రెడ్డి చారిత్రాత్మక తీర్పులు ఇచ్చి, న్యాయమూర్తిగా పేరుగడించారన్నారు. బీజేపీ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త కావడంతో, తాము ఆయనకు మద్దతివ్వలేదన్నారు. అమెరికా పన్ను విధింపుతో తమిళనాడు సహా పలు రాష్ట్రాలు వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఇందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విదేశాంగ విధానాల వైఫల్యాలే కారణమని స్పీకర్ ఆరోపించారు.

రూ.80 కోట్లతో జీసీసీ కౌన్సిల్ హాలు

వీధి కుక్కల నియంత్రణ, మెరీనా బీచ్ రోడ్డు అభివృద్ధికి చర్యలు

జీసీసీ కౌన్సిల్‌లో 84 తీర్మానాలకు ఆమోదం



వాకౌట్ చేస్తున్న సీపీఎం కార్పొరేటర్లు

కౌన్సిల్ సమావేశం ప్రారంభమైన వెంటనే పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఎం కార్పొరేటర్లు పట్టుబట్టారు. కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. సభ్యులు శాంతించి వారి వారి సీట్లలో కూర్చోవాలని మేయర్, డిప్యూటి మేయర్ సూచించినా వారు వినలేదు. ఒకానొక దశలో సీట్లలో కూర్చోండి లేదా బయటకు వెళ్లండి అని డిప్యూటీ మేయర్ అనడంతో సీపీఎం కార్పొరేటర్లు జయరామన్, రేణుక, ప్రియదర్శిని, సరస్వతి సమావేశం నుంచి వాకౌట్ చేశారు.



సమావేశంలో మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమరగురుపరన్, కార్పొరేటర్లు

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కౌన్సిల్ సమావేశం మంగళవారం జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనంలో మేయర్ ప్రియ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమరగురుపరన్ తదితరులు పాల్గొన్నారు. తమ తమ వార్డుల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, వీధి శునకాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సమావేశంలో పలువురు కార్పొరేటర్లు కోరారు. నగరంలో వీధి శునకాల నియంత్రణకు చర్యలు చేపట్టామని, ప్రతిరోజు సుమారు 3వేల శునకాలకు రాబిస్, వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామని మేయర్ ప్రియ తెలిపారు. డిసెంబరు లోగా మండలానికి ఒకటి చొప్పున 15 మండలాల్లో కుక్కల సంతాన నిరోధక కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మెరీనా బీచ్ రోడ్డును వార్ మెమోరియల్ నుంచి లైట్ హౌస్ వరకు అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. 2.30 కిమీ వరకు 4 మీటర్ల వెడల్పున సింథటిక్ సైకిల్ మార్గం ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. కామరాజర్ రోడ్డుకు ఇరువైపులా 8 ప్రాంతాల్లో బస్టాండ్లు, మూడు పోలీస్ బూత్‌లు, కామరాజర్ రోడ్డులోని పారంపర్య కట్టడాలు వీక్షించేలా 9 ప్రాంతాల్లో ప్రదర్శన వేదికలు ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. అలాగే, రిప్పన్ భవనం ప్రాంగణంలో రూ.80 కోట్లతో జీసీసీ కౌన్సిల్ హాలు నిర్మించనున్నట్లు మేయర్ తెలిపారు. ఈ సమావేశంలో 84 తీర్మానాలు ఆమోదించినట్లు కమిషనర్ తెలిపారు.

కాలేజ్ లేన్‌కు జయశంకర్ పేరు...

ఇదిలా ఉండగా జీసీసీ సమావేశంలో తమిళ సినీ జేమ్స్‌బాండ్ జయశంకర్ నివసించిన నుంగంబాక్కం 'కాలేజ్ లేన్' పేరును 'జయశంకర్ సాలై (రోడ్డు)'గా మార్చుతూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు పట్ల సభ్యులు హర్షం ప్రకటించారు. జయశంకర్ క్రైం చిత్రాలే కాకుండా కుటుంబ కథా చిత్రాలలోను నటించి మంచి పేరు సంపాదించుకున్నారని, ఎన్నో యేళ్ల పాటు నుంగంబాక్కం 'కాలేజ్ లేన్'లోని నివసించారని, అందుకే ఆ వీధికి జయశంకర్‌పేరు పెట్టినట్లు మేయర్ ప్రియా తెలిపారు.

కల్యాణసుందరనార్‌కు నివాళి



తమిళ సాహితీవేత్త తిరు వి.కల్యాణసుందరనార్ 142వ జయంతి సందర్భంగా మదురవాయల్‌లో ఉన్న ఆయన విగ్రహం, చిత్రపటం వద్ద ప్రభుత్వం తరపున నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కే గణపతి, తమిళ భాషాభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి వి.రాజారామన్, తమిళ భాషాభివృద్ధి శాఖ సంచాలకులు ఎన్.అరుళ్ తదితరులు

డీఎంకేను గద్దె దింపేందుకే బీజేపీతో పొత్తు

● ఎడప్పాడి పళనిస్వామి



సభలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డీఎంకేను అధికారం నుండి ఇంటికి సాగనంపేందుకే బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంలో గత నెల 7వ తేదీన కోవై మేట్టుపాళయంలో ప్రారంభించిన ఈపీఎస్ ప్రచారయాత్ర మంగళవారం తిరుచ్చి జిల్లా శ్రీరంగం చేరుకుంది. రంగనాథస్వామి ఆలయ రాజగోపురం సమీపంలో ఈపీఎస్ మాట్లాడుతూ, ఆచరణలకు సాధ్యంకాని హామీలతో రాష్ట్రప్రజలను మభ్యపెట్టి డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 51 నెలలు దాటిందని, అయినా శ్రీరంగం నియోజకవర్గం మాత్రం అభివృద్ధిలో వెనుబడివుందని ఆరోపించారు. భారతదేశంలో ప్రముఖ వైష్ణవక్షేత్రమైన శ్రీరంగానికి జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పలు పథకాలు అమలుచేసి అభివృద్ధి తోడ్పడి, ఇక్కడున్న గ్రామాలను నగరాలుగా మార్చారని తెలిపారు. దేశంలోనే ఉన్నత విద్యలో తమిళనాడు అగ్రస్థానంలో ఉన్నదని 2019లోనే కేంద్రప్రభుత్వం అధికారపూర్వకంగా ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, అధికార వర్గ నేతల అండదండలతో నామక్కల్‌లోని ఓ ఆస్పత్రి యాజమాన్యం పేద కార్మికుల కిడ్నీలను దొంగిలించి ఆర్థికంగా లబ్ధిపొందుతున్న వ్యవహారంపై సీఎం స్టాలిన్ ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. డీఎంకే సమయానికి తగ్గట్టుగా కూటమిని ఏర్పాటు చేసుకుంటుందని, 1999, 2001లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కూటమిలో చేరి కేంద్రమంత్రి వర్గంలో భాగస్వామ్యం వహించిందని, ఆ సమయంలో బీజేపీని డీఎంకే నేతలు మంచి పార్టీ అని పొగడ్తలతో ముంచెత్తారని, అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో అన్నాడీఎంకే పొత్తు కుదుర్చుకోవడంపై డీఎంకే విమర్శించడం న్యాయం కాదని ఈపీఎస్ పేర్కొన్నారు.

సమాచార దృష్టి

టెన్త్ రీ వాల్యుయేషన్ ఫలితాల విడుదల

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల రీ టోటలింగ్, రీ వాల్యుయేషన్ ఫలితాలు మంగళవారం విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది. గత ఏప్రిల్‌లో నిర్వహించిన టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు జూలైలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. వాటి ఫలితాలు ఇటీవల విడుదల కాగా, పలువురు విద్యార్థులు రీ వాల్యుయేన్, రీ టోటలింగ్ కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఫలితాలు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నట్లు, జాబితాలో నెంబరు లేని పక్షంలో, వారి మార్కుల్లో తేడాలు లేవని గమనించాలని పరీక్ష శాఖ తెలిపింది.

ఎలక్ట్రానిక్ పరికరాల ఎగుమతుల్లో రాష్ట్రం అగ్రస్థానం

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఐఫోన్ ఎగుమతుల కారణంగా దేశంలోనే తమిళనాడు ఎలక్ట్రానిక్ పరికరాల ఎగుమతుల్లో అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రం నుంచి ఎలక్ట్రానిక్స్ పరికరాల ఎగుమతుల విలువ గత 2020-21లో రూ.14,565 కోట్లుండగా, 2024-25లో రూ.1,28,536 కోట్లకు పెరిగింది. ఆ ప్రకారం, రాష్ట్రం నుంచి ఎలక్ట్రానిక్స్ ఎగుమతి విలువ 783 శాతానికి పెరిగిందని అధికారులు తెలిపారు.

28,29 తేదీల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శుభ ముహూర్తపు రోజులైన ఈ నెల 28,29 తేదీల్లో అదనపు టోకెన్లు అందజేయాలని రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, ఒక సబ్ రిజిస్ట్రార్ పనిచేసే కార్యాలయాల్లో వంద టోకెన్లగా బదులుగా 150, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లున్న కార్యాలయాల్లో 200లకు బదులు 300 టోకెన్లు అందించనున్నారు. అలాగే, అధిక రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయాల్లో వంద బదులు 150 టోకెన్లు అందించనున్నారు. తత్కాల్ విభాగంలో 12 టోకెన్లకు అదనంగా మరో నాలుగు టోకెన్లు అందజేయనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది.

మందవెల్లి బస్టాండ్ తాత్కాలికంగా మూసివేత

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మందవెల్లి బస్టాండ్, వాణిజ్య కాంప్లెక్స్‌తో కూడిన బస్టాండ్‌గా మార్చే నిర్మాణపనులు ప్రారంభం కానున్నాయి. ఈ కారణంగా ఈ బస్టాండ్‌ను బుధవారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఈ బస్టాండ్ నుంచి నడిపే సిటీ బస్సులు ఇతర ప్రాంతాల నుంచి బయల్దేరనున్నాయి. నెలవారీ పాస్‌లు, సీనియర్ సిటిజన్లు ప్రయాణించే ఉచిత టోకెన్లు పట్టణంబాక్కం బస్టాండ్ నుంచి పొందవచ్చని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది.

28 ఈపీఎఫ్ గ్రీవెన్స్

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భవిష్య నిధి (ఈపీఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు చెన్నై సహా 8 మండలాల్లో ఈ నెల 28వ తేది జరుగనున్నాయి. 'ఈపీఎఫ్ మీ చెంత' అనే పేరుతో చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు, వేలూరు, తిరువణ్ణామలై, రాణిపేట, తిరుపత్తూర్ తదితర 8 మండలాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. కార్మికులు, సంస్థలు ఈ శిబిరంలో పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

శనివారం టైంటేబుల్‌తో నేడు మెట్రో రైళ్లు

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా బుధవారం మెట్రోరైళ్లు శనివారం టైం టేబుల్ ప్రకారం నడుస్తాయని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైలు సేవలు అందుబాటులో ఉంటాయి. పీక్ అవర్స్ (ఉదయం 8-11, సాయంత్రం 5-రాత్రి 8 గంటలు) ఆరు నిమిషాలకు ఒకటి, నాన్ పీక్ అవర్స్ (తెల్లవారుజామున 5-ఉదయం 8, 11-సాయంత్రం 5, రాత్రి 8-10 గంటలు) ఏడు నిమిషాలకు ఒక రైలు, ఎక్స్‌టెండెడ్ పీక్ అవర్స్ (రాత్రి 10-11 గంటలు) 15 నిముషాలకు ఒక రైలు నడుపనున్నట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

నగరంలో విద్యుత్ లైన్లు తనిఖీ చేయండి

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మార్గాలు తనిఖీ చేయాలని విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. విద్యుత్ తీగలు భూమి నుంచి బయటకు కనిపించకుండా పనులు చేపట్టాలన్నారు. భూమిపై కనిపిస్తున్న విద్యుత్ తీగలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే, నాలుగు రోజుల్లో వాటిని సమర్పించి నివేదిక అందజేయాలని విద్యుత్ బోర్డు ఇంజనీర్లు, ఉద్యోగులను ఆదేశించింది.

నేటినుంచి 3,529 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి, శుభ ముహూర్తం, వారాంతపు సెలవుల సందర్భంగా 3,519 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోవై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు గురువారం 610 బస్సులు, శుక్రవారం 405, శనివారం 380, ఆదివారం 875 బస్సులు నడుపనున్నారు. కోయంబేడు టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు గురు, శుక్రవారాల్లో తలా 90 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి గురు, శుక్రవారాల్లో తలా 24 బస్సులు నడుపనున్నారు. సెలవుల తరువాత తిరిగొచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

పెంపుడు జంతువుల విక్రయాలకు నమోదు

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువు విక్రయ దుకాణాలు జంతు సంక్షేమ బోర్డులో నమోదుచేసుకోవాలని తమిళనాడు జంతువుల సంక్షేమ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు 2020 సెప్టెంబరు 12న ప్రకటన విడుదల చేశామన్నారు. కానీ, కొన్ని దుకాణాలు బోర్డులో పేరు నమోదుచేయకుండా విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులందాయని, ఇది చట్టరీత్యా నేరమని తెలిపింది. ఇప్పటివరకు బోర్డులో నమోదుచేయకుండా పనిచేస్తున్న దుకాణాలు సెప్టెంబరు 30వ తేదిలోపు https://tnawb.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవాలని, నమోదు చేయని దుకాణాలపై అక్టోబరు 1వ తేది నుంచి చర్యలు చేపడతామని బోర్డు హెచ్చరించింది.

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికుడి కన్నుమూత



సైనికుడు చరణ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ దాడుల్లో పాల్గొన్న విరుదునగర్ జిల్లాకు చెందిన సైనికుడు చరణ్ గుండెపోటుతో కన్నుమూశారు. సోమవారం సాయంత్రం ఆయన స్వస్థలంతో అంత్యక్రియలు నిర్వహించారు. విరుదునగర్ జిల్లా వెంబకోట సమీపంలోని ముత్తుసామిపురానికి చెందిన రామసామి, వీర ఓవమ్మాళ్ దంపతుల కుమారుడు చరణ్ (29) భారత సైన్యంలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నారు. ఆయనకు పవిత్ర (24) అనే భార్య, 11 నెలల కుమార్తె ఉన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలోని సైనిక స్థావరంలో 54 ఆర్ఆర్ విభాగంలో చరణ్ పని చేస్తుండగా, ఆపరేషన్ సింధూర్‌లో తన వంతు సేవలందించారు. ఈ నెల 22న జమ్మూకశ్మీర్‌లో విధి నిర్వహణలో ఉండగా హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే ఆయనను సైనిక ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స ఫలించక కన్నుమూశారు. చరణ్ భౌతికకాయాన్ని స్వస్థలమైన ముత్తుసామిపురానికి సోమవారం ఉదయం తరలించారు. సాయంత్రం అక్కడి కుటుంబ సభ్యులు, స్థానికుల అశ్రునయనాల నడుమ సైనిక లాంఛనలతో చరణ్ అంత్యక్రియలు జరిగాయి.

స్కానింగ్ చేయండి.... సమస్య చెప్పండి

● క్యూ ఆర్ కోడ్ పరిచయం చేసిన తిరువళ్లూర్ ఎంపీ



ఎంపీ ఏర్పాటుచేసిన క్యూ ఆర్ కోడ్

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి, నియోజకవర్గ ప్రజలు వారి సమస్యలు తెలియజేసే విధానాన్ని తిరువళ్లూర్ ఎంపీ పరిచయం చేశారు, తిరువళ్లూర్ ఎంపీగా కాంగ్రెస్‌కు చెందిన శశికాంత్ సెంథిల్ వ్యవహరిస్తున్నారు. ఈ లోక్‌సభ నియోజకవర్గంలో గుమ్మిడిపూండి, పొన్నేరి, తిరువళ్లూర్, పూందమల్లి, మాధవరం, ఆవడి తదితర అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అన్ని నియోజకవర్గాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం విజయం సాధించి తర్వాత ఎంపీని చూసేందుకు వీలుకావడం లేదని నియోజకవర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి అధికమించేలా ఎంపీ శశికాంత్ సెంథిల్, ప్రజల సమస్యలు, కోరికలు తెలుసుకునేలా క్యూఆర్ కోడ్ విధానం పరిచయం చేశారు. ఈ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే, అది నేరుగా 'నమ్మ ఊరిల్...నమ్మ ఎంపీ' అనే విభాగానికి వెళుతుంది. ఈ విభాగంలో పేరు, సెల్‌ఫోన్ నెంబరు, చిరునామా, ఆధార్, రేషన్ కార్డు నమోదు చేసి తర్వాత, సమస్య, కోరిక నమోదుచేయాల్సి ఉంటుంది. ఈ క్యూఆర్ కోడ్ ప్రజలకు తెలియజేసేలా నియోజకవర్గంలో అంటించిన పోస్టర్లు సామాజిక మాధ్యమాల్లో వెలువడ్డాయి.

ఎస్డీఎన్బీ వైష్ణవ్ మహిళా కళాశాలకు నోబుల్ వరల్డ్ రికార్డ్ గుర్తింపు

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని ఎస్డీఎన్బీ వైష్ణవ్ మహిళా కళాశాలకు నోబుల్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ గుర్తింపు లభించింది. ఈ నెల 18 నుండి 23 వరకు 5157 మంది విద్యార్థులు బేకింగ్, మెహందీ, శారీ డ్రాపింగ్, డిజిటల్ మార్కెటింగ్, టాక్స్ ఫైలింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ సహా 28 అంశాల్లో ప్రతిభాపాటవాలు, నైపుణ్యత ప్రదర్శించినందుకుగాను ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కాంతిమతి స్వాగతోపన్యాసం చేశారు. నోబుల్ వరల్డ్ రికార్డ్ డైరెక్టర్ డాక్టర్ హేమలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఎస్ఎఫ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ విజయ, కళాశాల చైర్మన్ మమతా డి భట్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి త్రైమాసిక పరీక్షలు

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం పాఠశాల విద్యార్థుల త్రైమాసిక పరీక్షలు సెప్టెంబరు 15వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యా డైరెక్టర్, ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సెప్టెంబరు 15న ప్రారంభమయ్యే పరీక్షలు 26వ తేది వరకు జరుగనున్నాయి. టెన్త్ పరీక్షలు కూడా అవే తేదీల్లో జరుగనున్నాయి. 11,12వ తరగతి విద్యార్థులకు సెప్టెబంరు 10 నుంచి 25వ తేది వరకు జరుగనున్నట్లు ప్రకటించారు. 10,12 తరగతి విద్యార్థులు ఉదయం, 11వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటనలో తెలిపారు.

రేపు 'ఓనం' ప్రత్యేక రైలు

అడయార్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఓనం పండుగ సందర్భంగా డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-కన్నూర్ మధ్య ప్రత్యేక రైలు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06009 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-కన్నూర్ ప్రత్యేక రైలు ఈ నెల 28వ తేది రాత్రి 11.55 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 2 గంటలకు కన్నూర్ చేరుకుంటుంది. ఈ రైలు రిజర్వేషన్ బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

కొల్లం-తాంబరం ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పు

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కొల్లం-తాంబరం (నెం.16102) ఎక్స్‌ప్రెస్ రైలు సమయం మారింది. ప్రస్తుతం కొల్లం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరే రైలు వేకువజామున 2.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఇక నుంచి ఈ రైలు కొల్లంలో సాయంత్రం 4 గంటలకు బయల్దేరి ఉదయం 7.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ మార్పు సెప్టెంబరు 1వ తేది నుంచి అమలకు వస్తుందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.చంద్రన్

తిరుత్తణి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని ఎగువ, దిగువ నెడిగళ్ల గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను మంగళవారం ఉదయం ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో నేతలు అండగా ఉంటారని, ప్రజలంతా డీఎంకేకు మద్దతుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంకే మండల కార్యదర్శి జి. రవీంద్ర, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరువాన్మియూర్-ఉద్దాండి మధ్య నాలుగు లేన్ల ఫ్లై ఓవర్

● రూ.2,100 కోట్ల ప్రాజెక్టుకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈసీఆర్ రోడ్డులో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా తిరువాన్మియూర్ నుంచి ఉద్దాండి వరకు నాలుగు లేన్ల ఫ్లై ఓవర్ నిర్మించనున్నట్లు ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో మంత్రి ఏవీ వేలు ప్రకటించారు. ఆ ప్రకారం, 14.2 కి.మీ మేర నాలుగు లేన్ల ఫ్లై ఓవర్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,100 కోట్లు కేటాయించింది. ఈ విషయమై రహదారుల శాఖ అధికారులు మాట్లాడుతూ... ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో తిరువాన్మియూర్ నుంచి ఉద్దాండి వరకు నాలుగు లేన్ల ఫ్లై ఓవర్ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించామన్నారు. రాష్ట్ర రహదారుల కమిషన్ ఈ పనులు పర్యవేక్షిస్తుందని తెలిపారు. ప్రస్తుతం తిరువాన్మియూర్ నుంచి ఉద్దాండి వెళ్లేందుకు సుమారు 45 నిముషాలు పడుతోందని, ఫ్లై ఓవర్ నిర్మాణంతో 20 నిమిషాల్లో చేరుకోవచ్చని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తిచేసి త్వరలో నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

విజయ్ బౌన్సర్లపై పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదుతో ఎస్పీ కార్యాలయానికి వెళ్లిన శరత్‌కుమార్ కుటుంబ సభ్యులు

ప్యారీస్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ర్యాంప్ వాక్ చేసిన వేదికపైకి ఎక్కిన సమయంలో బౌన్సర్లు కిందికి నెట్టిన యువకుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మదురై జిల్లా పారాపత్తి ప్రాంతంలో ఈ నెల 21న టీవీకే రెండో మహానాడు కార్యక్రమం జరిగింది. ఇందులో విజయ్ భద్రతకు 3వేల మందికి పైగా బౌన్సర్లను నియమించారు. మహానాడు ప్రాంగణం మధ్య ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై విజయ్ నడుస్తున్న సమయంలో ఓ యువకుడు హఠాత్తుగా ఆ వేదికపైకి ఎక్కడం చూసిన బౌన్సర్లు అతడిని కిందకి తోసేశారు. దాంతో ఆ యువకుడి కాలికి బలమైన గాయాలయ్యాయి. కదలలేని పరిస్థితిలో ఏడుస్తూ తనను ఆస్పత్రికి తరలించాలని వేడుకున్నా.. అక్కడున్న ఎవరూ కూడా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో, పెరంబలూరు జిల్లా పెరియపాళయం గ్రామానికి చెందిన శరత్‌కుమార్ అనే ఆ యువకుడి తల్లి, సోదరుడు మంగళవారం పెరంబలూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో విజయ్ బౌన్సర్లపై ఫిర్యాదు చేశారు. బౌన్సర్లు కిందికి తోసినందువల్ల తమ కుమారుడి కాలికి గాయాలయ్యాయని, కనుక చర్యలు చేపట్టాలని ఆ ఫిర్యాదులో తెలిపారు.

ఆంధ్రాలో చిరంజీవే పార్టీని విలీనంచేశారు...!

● నటుడు విజయ్‌కు మాజీ మంత్రి వేలుమణి హితవు



పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలో భారీ జన సమీకరణ చేసి పార్టీ ప్రారంభించిన నటుడు చిరంజీవి, ఆ పార్టీని రద్దు చేశారు, కానీ, ఈపీఎస్ ఎవరో కూడా తెలియదు అన్న నటుడు విజయ్ రాజకీయాల్లో ఏమి సాధిస్తారని అన్నాడీఎంకే మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి ఎద్దేవా చేశారు. మదురైలో సెప్టెంబరు 1 నుంచి ఎడప్పాడి పళనిస్వామి ప్రచారం చేపట్టనున్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేసేలా కున్నత్తూర్‌లో అన్నాడీఎంకే పూతల సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో వేలుమణి మాట్లాడుతూ... ఎంతో మంది నటులు రాజకీయాల్లోకి వచ్చారని, ఇప్పుడు కూడా నటుడు విజయ్ రాజకీయాల్లోకి వచ్చారన్నారు. మదురై మహానాడులో ఆయన ప్రసంగం ప్రజలందరూ విన్నారన్నారు. ఆయన చిత్రాలు (నటుడు విజయ్) చిత్రాలు చూసి మేము కూడా ఆనందించామని, కానీ, మదురై మహానాడులో అన్నాడీఎంకే నేత ఎవరు? అని ప్రసంగించడం విడ్డూరంగా ఉందన్నారను. 2026 ఎన్నికల్లో ఈపీఎస్ ముఖ్యమంత్రి అవుతారని, విజయ్ సహా ఎవరూ దీనిని అడ్డుకోలేరని వేలుమణి తెలిపారు.

కేరళకు తరలిస్తున్న పేలుడు పదార్థాల స్వాధీనం



వ్యాన్‌లోని జెలిటిన్ స్టిక్ బాక్స్‌లను పరిశీలిస్తున్న కోవై ఉగ్రవాద నిరోధక విభాగం పోలీసు అధికారులు

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపంలో కేరళకు వ్యాన్‌లో తరలిస్తున్న 2 వేల కేజీల జెలిటెన్ స్టిక్‌లను ఉగ్రవాద నిరోధక విభాగం పోలీసులు మంగళవారం వేకువజామున స్వాధీనం చేసుకుని, వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేరళకు పేలుడు పదార్థాలు అక్రమంగా రవాణా అవుతుందనే సమాచారంతో ఉగ్రవాద నిరోధక విభాగం పోలీసులు వేకుజామునే వాహనాల తనిఖీలు చేపట్టారు. కోయంబత్తూరు సమీపంలోని మదుక్కరై వద్ద వేగంగా వెళ్తున్న వ్యాన్‌ను ఆపి పోలీసులు సోదా చేయగా అందులో జెలెటిన్ స్టిక్ బాక్సులు లభ్యమయ్యాయి, వ్యాన్ డ్రైవర్ కుబేర్‌ను అరెస్టు చేసి మదుకరై పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్ళి విచారణ జరిపారు. ఆ పేలుడు పదార్థాలకు సంబంధించి ఎలాంటి రశీదులు, పత్రాలు లేవని కనుగొన్నారు. పోలీసుల విచారణలో 2 వేల కేజీల జెలిటెన్ స్టిక్స్ కేరళలోని క్వారీల్లో ఉపయోగించడానికి తీసుకెళుతున్న వెల్లడైంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

మదురై మేయర్ మార్పుపై కొనసాగుతున్న ప్రతిస్తంభన



మేయర్ ఇంద్రాణి

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదురై కార్పొరేషన్ మేయర్ మార్పు విషయంలో అటు డీఎంకే, ఇటు అన్నాడీఎంకే నాయకులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేక అయోమయం పడ్డారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మదురైలో పర్యటనకు ముందే మేయర్ మార్పుపై నిర్ణయం తీసుకోవాలని డీఎంకే అధిష్ఠానం భావిస్తోంది. మదురై కార్పొరేషన్‌లో ఆస్తిపన్నుల విధింపులో జరిగిన అవినీతి అక్రమాలకు సంబంధించి మేయర్ ఇంద్రాణి భర్త పొన్ వసంత్, పన్నుల విధింపు కమిటీ అధ్యక్షురాలు విజయలక్ష్మి భర్త కన్నన్, ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు సహా 17 మంది అరెస్టయ్యారు. ఈ వ్యవహారంలో విచారణకు పిలిపించిన జోనల్ కమిటీ అధ్యక్షులు ఐదుగురు, ఇద్దరు స్టాండింగ్ కమిటీ చైర్మన్లను పదవుల నుండి తొలగించారు. అదే సమయంలో పన్నుల విధింపు అవినీతి అక్రమాల్లో ప్రధాన నిందితుడిగా భర్త అరెస్టయినప్పటికీ ఇంద్రాణి మేయర్‌గా కొనసాగుతుండటం పట్ల డీఎంకేతో పాటు అన్నాడీఎంకే కార్పొరేటర్లు సైతం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మేయర్ ఇంద్రాణిని మార్చాలంటూ ఆరంభంలో గగ్గోలు పెట్టిన అన్నాడీఎంకే కార్పొరేటర్లు పట్టుసడలించి మెతక వైఖరిని అవలంబించడంపై డీఎంకే నేతలు విస్తుపోతున్నారు. ఈ విషయమై డీఎంకే సీనియర్ నాయకుడొకరు మాట్లాడుతూ మేయర్ ఇంద్రాణిని మార్చాలని డీఎంకే అధిష్ఠానవర్గం ఎప్పుడో నిర్ణయం తీసుకుందని, ఆమెకు బదులుగా కొత్తవ్యక్తిని ఆ పదవిలో కూర్చోబెట్టే బాధ్యతను నగర పాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూకు అప్పగించిందని చెప్పారు. ఆ మేరకు మంత్రులు కేఎన్ నెహ్రూ, పళనివేల్ త్యాగరాజన్, డీఎంకే జిల్లా శాఖ కార్యదర్శులు దళపతి, మణిమారన్ తో సమావేశమై చర్చలు జరిపారని, ఆ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్లే మేయర్ మార్పు వాయిదా పడిందని చెప్పారు. మంత్రి మూర్తి మాజీ జోనల్ కమిటీ అధ్యక్షురాలు వాసుకిని, మంత్రి పళనివేల్‌రాజన్, జిల్లా కార్యదర్శి దళపతి కలిసి 61 వ వార్డు కార్పొరేటర్ సెల్విని, మరో జిల్లా కార్యదర్శి మణిమారన్ 95వ వార్డు కార్పొరేటర్ ఇందిరాగాంధీని మేయర్ పదవికి ప్రతిపాదించారు. ఇంద్రాణిని మేయర్ పదవి నుండి తొలగించాల్సి వస్తే తమ వర్గానికి చెందిన సెల్విని ఆ పదవికి ఎంపిక చేయాలని దళపతి, మంత్రి పళనివేల్ త్యాగరాజన్ డిమాండ్ చేస్తున్నారు. డీఎంకే అధిష్ఠానం మదురై మేయర్‌గా ఎవరిని ఎంపిక చేయాలనే విషయమై రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగాన్ని రంగంలోకి దింపి సర్వే కూడా జరిపింది. సెప్టెంబర్ 1 నుంచి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ మదురై జిల్లాలో పర్యటించనున్నారు. ఆ లోగా మేయర్ ఇంద్రాణిని పదవి నుండి తొలగించి కొత్త వ్యక్తిని మేయర్‌గా నియమించాలని డీఎంకే అధిష్ఠానం తొందరపడుతోంది.

మరణిస్తూ... ఆరుగురికి పునర్జన్మ



ఇళంగో (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన బాలుడు తాను మరణిస్తూ ఆరుగురికి పునర్జన్మ ప్రసాదించాడు. తిరుప్పూర్ ముదలిపాళయం సిడ్కో వెల్లకరడు ప్రాంతానికి చెందిన ఎలిజబెత్ (38) భర్త వేలుస్వామి కొన్నేళ్ల క్రితం మృతి చెందగా, కుమారుడు ఇళంగో (15) కలసి ఉంటోంది. ఇళంగో 10వ తరగతి ఉత్తీర్ణుడై, ఇంట్లోనే ఉంటున్నాడు. ఇళంగో ఈ నెల 21వ తేది రాత్రి తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, విజయాపురం-సిడ్కో రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నారు.. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలైన ఇళంగోను తిరుప్పూర్ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు, మెదడు నిర్జీవమైనట్లు నిర్ధారించారు. ఇళంగో అవయవాలు దానంగా ఇచ్చేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా అవయవాలను తొలగించిన వైద్యులు అంబులెన్స్‌లో కోయంబత్తూర్‌కు పంపారు. అక్కడి నుండి గుండె, ఒక మూత్రపిండాన్ని చెన్నైలోని ప్రైవేటు ఆసుపత్రికి, కాలేయాన్ని కోయంబత్తూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి, ఒక మూత్రపిండాన్ని కోయంబత్తూర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి, కళ్లు అరవింద్ కంటి ఆసుపత్రికి పంపారు. అవయవాలు దానం చేసి ఇళంగో మృతదేహానికి తిరుప్పూర్ ప్రభుత్వ వైద్యకళాశాల డీన్ మనోన్మణి, వైద్యులు, నర్సులు, వైద్య కోర్సులు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఏడుగురు రామేశ్వరం జాలర్ల విడుదల

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన రామేశ్వరానికి చెందిన ఏడుగురు జాలర్లకు జరిమానాతో విడుదల చేస్తూ ఆ దేశ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. సరిహద్దులు దాటి చేపల వేట సాగిస్తున్నారని ఆరోపిస్తూ ఈ నెల 9న ఏడుగురు రామేశ్వరం జాలర్లను లంక నావికాదళం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించింది. రిమాండ్ గడువు ముగియడంతో జాలర్లను కోర్టులో హాజరుపరచగా, ఆరుగురు జాలర్లకు రూ.87,000, ఒక జాలరికి రూ.14,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, స్వాధీనం చేసుకున్న పడవకు సంబంధించిన విచారణకు సంబంధించి 2026 జనవరి 22న పడవ యజమాని హాజరుకావాలని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వెటర్నరీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్



ప్రిన్సిపల్ సౌందరరాజన్

ప్యారీస్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చెన్నై వెటర్నరీ వైద్యకళాశాల ప్రిన్సిపల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. తమిళనాడు వెటర్నరీ మెడికల్ సైన్స్ యూనివర్శిటీ నిర్వహణలో చెన్నై, నామక్కల్, తిరునల్వేలి, వరత్తనాడు, సేలం తలైవాసల్, ఉడుమలపేట, తేని వీరపాండి తదితర ప్రాంతాల్లో వెటర్నరీ వైద్యకళాశాలలున్నాయి. ఈ నేపథ్యంలో వెపేరిలోని చెన్నై వెటర్నరీ వైద్యకళాశాలలో అవినీతి చోటుచేసుకుందని ఫిర్యాదులు రావడంతో దీనిపై జరిపిన విచారణలో రూ.5కోట్ల మేరకు అవినీతి జరిగినట్లు గుర్తించారు. దీనికి పాల్పడిన వెటర్నరీ వైద్యకళాశాల ప్రిన్సిపల్ సౌందరరాజన్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలో, రూ.5కోట్ల అవినీతిపై విచారణ జరిపి రెండు వారాల్లోగా నివేదిక సమర్పించేందుకు ముగ్గురితో కూడిన కమిటీని వెటర్నరీ వైద్య సైన్స్ యూనివర్శిటీ నియమించింది. ప్రిన్సిపల్‌కు సహకరించి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను బదిలీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన సౌందరరాజన్‌కు బదులుగా డాక్టర్ సతీష్‌ను కొత్త ప్రిన్సిపల్‌గా నియమించారు.

చికిత్సకు వచ్చిన వృద్ధురాలి నగల చోరీ

● ఉద్యోగికి 'ఎనిమా' ఇచ్చి తీసిన పోలీసులు

పెరంబూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చికిత్స వచ్చిన వృద్ధురాలి నుంచి 5 సవర్లు కాజేసిన ఆస్పత్రి ఉద్యోగిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లా విక్రమసింగాపురం ప్రాంతానికి చెందిన సుబ్బమ్మాళ్ (79) భర్త చనిపోవడంతో, కుమారుడు శంకర్ సుబ్రమణియన్ వద్ద ఉంటోంది. కొద్దిరోజులుగా సుబ్బమ్మాళ్ అనారోగ్యంతో బాధపడుతుండంతో కుటుంబ సభ్యులు ఆమెను తిరునల్వేలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. రెండు రోజుల క్రితం వార్డు బాయ్‌గా పనిచేస్తున్న రామర్ ఆ వృద్ధురాలి మెడలోని 5 సవర్ల నగ లాక్కొన్నాడు. దీంతో ఆమె 'దొంగ...దొంగ' అంటూ కేకలు వేయడంతో ఆస్పత్రి సిబ్బంది, బంధువులు అక్కడకు చేరుకున్నారు. వారి నుంచి తప్పించుకునేందుకు రామర్, బాత్రూంలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. బంధువులు బాత్రూమ్ తలుపులు బద్దలుకొట్టి అతనిని బయటకు తీసుకొచ్చి విచారించగా, నగ ఎక్కడో జారిపోయిందని బదులిచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని రామర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా, నగ ఎక్కడో పడిపోయిందని సమాధానమిచ్చాడు. అతని మాటలు నమ్మని పోలీసులు అతడికి 'ఎనిమా' చేయగా రామర్ మింగిన నగ బయటకు వచ్చింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసి పోలీసులు రామర్‌ను అరెస్ట్ చేశారు.

అత్యాచారం కేసులో యువకుడికి పదేళ్ల జైలుశిక్ష

ప్యారీస్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెంగల్పట్టు జిల్లాలో 9యేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి చెంగల్పట్టు పోక్సో కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. తురైపాక్కంకు చెందిన మునియప్పన్ 2015 ఏప్రిల్ 8న తొమ్మిదేళ్ల చిన్నారిని ఆడుకుందామని తీసుకెళ్లి చేతులు కాళ్లు కట్టేసి అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పింది. దీనిపై అందజేసిన ఫిర్యాదును నమోదు చేసుకున్న తురైప్పాకం పోలీసులు పోక్సో చట్టం కింద మునియప్పన్‌ను అరెస్టు చేసి, చెంగల్పట్టు పోక్సో కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఈ కేసు కోర్టు ధర్మాసనం ముందుకు రాగా వాదనల అనంతరం నిందితుడు మునియప్పన్‌కు పదేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నజీమా భాను తీర్పునిచ్చారు. ఈ కేసులో బాధితురాలికి నష్టపరిహారంగా రూ.4లక్షలు చెల్లించాల్సిందిగా రాష్ట్రప్రభుత్వానికి న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

టైర్ల గోదాములో అగ్నిప్రమాదం

ప్యారీస్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌హిల్స్‌లోని ఓ టైర్ల గోదాములో సంభవించిన అగ్నిప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. తండల్‌కళని ప్రాంతంలో అభినందన్‌కు చెందిన టైర్ల గోదాములో కొత్త టైర్లు, పాత టైర్లు, ట్యూబులు నిల్వవుంచి ఆర్డర్ల మేరకు దుకాణాలకు సరఫరా చేస్తుంటారు. రోజూలాగే సోమవారం రాత్రి గోదాముకు తాళం వేసి అభినందన్ ఇంటికెళ్లారు. ఈ నేపథ్యంలో, రాత్రి 11 గంటల సమయంలో ఆ టైర్ల గోదాము నుండి దట్టమైన పొగలతో కూడిన మంటలు వ్యాపించడాన్ని గుర్తించిన స్థానికులు రెడ్‌హిల్స్ పోలీస్‌స్టేషన్‌కు, అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు 2 గంటలు శ్రమించి మంటలను అదుపుచేశారు. అప్పటికే ఆ గోదాములో టైర్ రీట్రేడింగ్ చేసే ఆధునిక పరికరాలు, కొత్త టైర్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. అదృష్టవశాత్తు రాత్రి సమయం కావడంతో ఉద్యోగులు ఎవరూ లేని కారణంగా ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

నీట్ పీజీ పరీక్షలో ఫెయిలై పుదుచ్చేరిలో డాక్టర్ ఆత్మహత్య

పుదుచ్చేరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో నీట్ పీజీ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించలేదన్న దిగులతో ఓ డాక్టర్ ఆత్మహత్య చేసుకున్నారు. పుదుచ్చేరి మురుంగపాక్కం సేత్తిలాల్ నగర్‌లో హరిబాబు, శరవణ ప్రియా అనే దంపతులు నివసిస్తున్నారు. వీరిద్దరూ డాక్టర్లు. వీరి కుమారుడు వెంకటేషబాబు (24) కదిర్‌గామం ఇందిరాగాంధీ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ చదివి పీజీ చేయడానికి నీట్ రాసి ఆ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. సోమవారం రాత్రి ఇంటి మిద్దెపై గదిలో నిద్రపోయాడు. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు అతడి గది లోపలి వైపు గడియ వేసి ఉండటం, ఎలాంటి అలికిడి వినిపించకపోవడంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్ళి చూశారు. ఆ గదిలో వెంకటేష్ బాబు నిర్జీవంగా పడి ఉండటం చూసి దిగ్ర్భాంతి చెందారు. శవం పక్కనే మత్తుమందు సూదులు పడి ఉండటంతో మోతాదుకు మించి మత్తు సూదులు వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావించారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముత్యాల్‌పేట పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.





కోయంబేడు మార్కెట్‌కు వచ్చిన అరటి గెలలు - కిటకిటలాడుతున్న కోయంబేడు మార్కెట్

చవితి పూజకు సర్వం సిద్ధం

● పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్లు





పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న దృశ్యం







గణపతి పూజలో విద్యార్థినులు





గణపతి వేషంలో విద్యార్థుల సందడి





ప్యారీస్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణనాధుడి పూజలకు రాష్ట్రం సర్వాంగసుందరంగా ముస్తాబైంది. భాద్రపద చతుర్థిని రాష్ట్రంలో వినాయక చవితిగా ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ ఏడాది మంగళవారం మధ్యాహ్నం 2.22 గంటలకు ప్రారంభమై బుధవారం మధ్యాహ్నం 3.52 గంటల వరకు చవితి ఉంది. దీంతో భక్తులు మంగళవారం ఉదయం నుండే మట్టి ప్రతిమలు, పండ్లు, పూలు, పత్రాలు, ప్రసాదానికి అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. దీంతో నగరంలోని మార్కెట్ ప్రాంతాలు కిటకిటలాడాయి. బుధవారం చవితికి సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పర్యావరణ శాఖ సూచనల మేరకు బంకమట్టితో తయారుచేసిన గణపతి విగ్రహాలను కొనుగోలు చేసి తమ నివాసాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా పోలీసు శాఖ అనుమతించిన ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన చావళ్లలో గణనాధుడి ప్రతిమలు కనువిందు చేస్తున్నాయి. పర్యావరణానికి హాని వాటిల్లకుండా మట్టి గణపతిని పూజిద్దామన్న నినాదంతో భక్తులు పండుగ జరుపుకుంటున్నారు. ముఖ్యంగా ఇతర మతాలకు భంగం కలుగకుండా విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. కాగా, రాజధాని నగరం చెన్నైలో సుమారు 5లక్షలకు పైగా వినాయకుడి విగ్రహాలను విక్రయించినట్లు వ్యాపారులు తెలిపారు. ఈ ప్రాంతాల్లో పోలీసు శాఖ ఉత్తర్వుల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొసపేట,కొళత్తూరు, పొన్నేరి, రెడ్‌హిల్స్ ఆవడి, తాంబరం తదితర ప్రాంతాల్లో గణపతి విగ్రహాల విక్రయాలు జోరుగా సాగాయి. వలసరవాక్కంలో హిందూ సంస్థలు నగరంలో సుమారు 1,500 భారీ విగ్రహాల ఏర్పాటుకు గణేష్ కమిటీ నిర్వాహకులకు పంపిణీ చేశాయి. ఇదిలా వుండగా, ప్రతిఏడాది లాగే ఈసారి కూడా శివగంగ జిల్లా పిళ్లయార్‌పట్టిలో విఘ్నేశ్వరుడికి లడ్డూ ప్రసాదాన్ని నివేదించారు. అదే విధంగా తిరుచ్చి పట్టణంలో కోట గుమ్మంపై వెలసిన ఉచ్చుపిళ్లయార్ ఆలయంలో వినాయక చవితి పండుగను ఈ ఏడాది 9 రోజుల పాటు నిర్వహించనున్నారు.



బంకమట్టి విగ్రహం

నగరంలో మూడు రోజులు నిమజ్జన ఊరేగింపు...

రాజధాని నగరంలోని 200 వార్డుల్లో 1,519 వినాయకుడి ప్రతిమలు పెట్టి పూజలు జరిపేందుకు పోలీసులు అనుమతించారు. తొలిరోజైన బుధవారం సాయంత్రం నుండి ఈ నెల 30వ తేదీ వరకు పోలీసులు అనుమతించిన మార్గాల గుండా నిర్ణయించిన సముద్రతీరాలో విగ్రహాలు నిమజ్జనం చేయవచ్చు. ఆదివారం వరకు వినాయక ప్రతిమల ఊరేగింపు, నిమజ్జనం భద్రతా పనుల్లో సుమారు 16వేల మంది పోలీసులు పాల్గొంటారు. కాగా,గతంలాగే పట్టినంబాక్కం, శ్రీనివాసపురం, కాశిమేడు ఫిషింగ్ హార్బర్, తిరువొత్తియూర్ తూనికలమేడు, నీలాంగరై పల్‌కలై నగర్, బీచ్ ప్రాంతాల్లో 3 నుండి పదడుగుల ఎత్తు వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. నిమజ్జనం సమయంలో భక్తులు సముద్రంలో గల్లంతు అవకుండా గజ ఈతగాళ్లను సిద్ధం చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఉండ్రాలయ్యా.. దీవించయ్యా...

పరాజయం.. విజయానికి సోపానం

● బీజేపీ మాజీ చీఫ్ అన్నామలై



తుపాకీ గురి చూస్తున్న బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఓటమిచెందితే క్రుంగి పోకూడదని, విజయం కోసం తీవ్రంగా పోరాడాలని, చివరకు ఓటములే విజయానికి సోపానాలవుతాయని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. పుదుకోట సమీపం కీరనూరు వద్ద గన్ షూటింగ్ పోటీల్లో గెలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర రైఫిల్ అసోసియేషన్, పుదుకోట రాయల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో గన్ షూటింగ్ పోటీలు ఈ నెల 22న ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం అన్నామలై బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా అన్నామలై తుపాకీ పట్టుకుని లక్ష్యం కేసి కాల్పులు జరిపారు. ఆ తర్వాత విజేతలకు పతకాలను ప్రదానం చేసి ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలపైనే కాకుండా చదువుపై కూడా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పోటీలో విజేతగా నిలిచిన డీఎంకే ఎంపీ టీఆర్ బాలు మనవడు సూర్యరాజ్‌కు అన్నామలై పతకం ఉన్న ట్యాగ్‌ను మెడలో వేయడానికి ప్రయత్నించినప్పుడు అడ్డుకుని పతకాన్ని చేతిలోకి తీసుకోగా, క్రీడాకారులందరూ అన్నామలైతో గ్రూప్‌ఫొటో తీసుకున్నారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

● వంద గృహాలకు వినాయక ప్రతిమలు అందించిన ముస్లింలు

అడయార్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పట్టణంలో మత సామరస్యం వెల్లివిరిసింది. వినాయక చవితి సందర్భంగా వంద ప్రతిమలు, పూజా సామగ్రిని ముస్లింలు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. దేశవ్యాప్తంగా బుధవారం వినాయక చవితి వేడుకలు జరుపుకోనున్నారు. ప్రతి ఏడాది మత సామరస్యం కోరుతూ, కృష్ణగిరి మిలాడి నబి బృందం ఆధ్వర్యంలో పూజా సామగ్రి అందజేస్తుంటారు. ఈ క్రమంలో బృందం అధ్యక్షులు అస్లాం నేతృత్వంలో ముస్లింలు ఇంటింటికీ వెళ్లి అడుగ ఎత్తున్న వినాయకుడి విగ్రహం, పండ్లు, పూలు తదితరాలను పెద్ద పాత్రలో ఉంచి అందజేశారు. ఈ విషయమై బృందం అధ్యక్షుడు అస్లాం మాట్లాడుతూ... 15 ఏళ్లుగా వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రి అందజేస్తుంటామని, ఈ ఏడాది వంద ఇళ్లకు విగ్రహాలు, పూజా సామగ్రి అందజేసి శుభాకాంక్షలు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో పీర్‌దేశ్‌ఖాన్, కరామత్, జమీర్, సబీబుల్లా, రియాజ్, బబ్లూ, నవాజ్, ఇర్ఫాన్ సహా 50 మంది పాల్గొన్నారు.



వినాయక ప్రతిమలు అందిస్తున్న ముస్లింలు

87 శాతం హామీలు నెరవేర్చని డీఎంకే

● పీఎంకే నేత అన్బుమణి

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లుదాటినా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన హామీల్లో 87 శాతం అమలు చేయకుండా రాష్ట్ర ప్రజానీకాన్ని మోసగించిందని పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) నాయకుడు డాక్టర్ అన్బుమణి ఆరోపించారు. టి.నగర్‌లోని స్టార్‌హోటల్‌లో మంగళవారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో డీఎంకే అమలు చేయని హామీల వివరాలతో ముద్రించిన 'విడియల్ ఎంగే? పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యపడని హామీలు ఇచ్చి ఓటర్లను మోసగించి డీఎంకే అధికారంలోకి వచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డీఎంకే మానిఫెస్టోలో మొత్తం 505 హామీలున్నాయని, వాటిలో 66 హామీలను అరకొరగా నెరవేర్చిందని, తక్కిన 439 హామీలను నెరవేర్చలేదని, 87 శాతం హామీలను గాలికి వదిలేసిందని అన్బుమణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంకే ప్రధాన కార్యదర్శి వడివేల్ రావణన్, కోశాధికారి తిలక్‌బామా, న్యాయవాది బాలు, శాసనసభ్యులు సదాశివం, శివకుమార్, వెంకటేశ్వరన్, పసుమై తాయగం అరుళ్, అడయార్ వడివేలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో 'విడియల్ ఎంగే?' పుస్తకాన్ని విడుదల చేస్తున్న డాక్టర్ అన్బుమణి

రోగుల పట్ల ఆప్యాయంగా వ్యవహరించాలి: నటి అంబిక

వేలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని శ్రీనారాయణి నర్సింగ్ కళాశాల స్నాతకోత్సవం మంగళవారం నారాయణి మహల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీనటి అంబిక పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ మాధవిని వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం నారాయణి ఎడ్యుకేషన్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ స్వాగతోపన్యాసం చేస్తూ, కరోనా సమయంలో వైద్యరంగం గొప్పతనం ప్రజలందరికీ తెలిసిందన్నారు. పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు ఎంతగానో కష్టపడతారని, వారి కష్టాలనికి తగిన ప్రతిఫలాన్ని విద్యార్థులు అందించాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథి అంబిక మాట్లాడుతూ, రోగులు కోలుకోవడంలో వైద్యుల సహకారం ఎంతో ముఖ్యమని, వారిచ్చే ధైర్యం వల్ల రోగి అనారోగ్యం నయమవుతుందని తెలిపారు. క్రమశిక్షణ తో చదివితే విజయం సాధిస్తారని,

వైద్యులే ప్రజల పాలిట సూపర్‌హీరోలన్నారు. మారుతున్న సాంకేతికతకు తగ్గట్టుగా విద్యార్థులంతా అత్యాధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. రోగుల పట్ల ఆప్యాయత, కరుణతో వ్యవహరించాలని, బాగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తేవాలని ఆమె విద్యార్థులకు తెలిపారు. చివరగా నటి అంబిక చేతుల మీదుగా విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న కళాశాల నిర్వాహకులు



కొత్త చిత్రం ప్రారంభోత్సవంలో ప్రభుదేవా, వడివేలు తదితరులు

ప్రభుదేవా - వడివేలు కాంబోలో యాక్షన్ అడ్వెంచర్ మూవీ

చిత్రజ్యోతి

చాలా రోజుల తర్వాత 'ఇండియన్ మైఖేల్ జాక్సన్' ప్రభుదేవా, ప్రముఖ హాస్య నటుడు వడివేలు కలిసి యాక్షన్ అడ్వెంచర్ మూవీలో నటించనున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. ఈ చిత్రానికి శ్యామ్ రొడ్రిగస్ దర్శకత్వం వహించనున్నారు. ఇందులో 'అనిమల్', 'ఏస్' చిత్రాల తర్వాత బబ్లూ పృథ్వీరాజ్ ఓ ముఖ్య పాత్ర పోషించనున్నారు. నవంబరులో షూటింగ్ ప్రారంభించి సింగిల్ షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేయాలని దర్శక నిర్మాతలు ప్లాన్ చేశారు. ఇది కేఆర్‌జీ నిర్మాణ సంస్థ నిర్మించే నాలుగో చిత్రం. భారీ బడ్జెట్‌తో నిర్మించేలా ప్లాన్ చేసినట్టు నిర్మాత కణ్ణన్ రవి వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని దర్శక నిర్మాతలు వెల్లడించారు.

ఇంతకాలం విజయ్ ఎక్కడున్నారు?

● ప్రశ్నించిన దక్షిణ్ విజయ్



ఇపుడు మీడియా ముందుకు వచ్చి దివంగత మహా నటుడు విజయకాంత్‌ను అన్నయ్య.. అన్నయ్య అంటూ టీవీకే అధ్యక్షుడు విజయ్ సంబోధించడాన్ని నిర్మాత, నటుడు దక్షిణ్ విజయ్ తప్పుపడుతున్నారు. ఇంతకాలం విజయ్ ఎక్కడకు వెళ్ళారంటూ ప్రశ్నించారు. రాజకీయ పార్టీ పెట్టగానే విజయకాంత్ గుర్తుకు వచ్చారా? అని దక్షిణ్ విజయ్ ప్రశ్నించారు. విజయకాంత్ జయంతి వేడుకలను పురస్కరించుకుని కోయంబేడులోని విజయకాంత్ సమాధికి నివాళులు అర్పించిన దక్షిణ్ విజయ్ మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల మదురైలో జరిగిన మహానాడులో విజయకాంత్‌ను హీరో విజయ్ అన్నా అని సంబోధించడం ఏమాత్రం సబబుగా లేదన్నారు. విజయ్‌తో పాటు నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ తమ రాజకీయం కోసం విజయకాంత్ పేరు ఉపయోగించుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. విజయకాంత్ కేవలం ఒకరిద్దరికీ మాత్రమే సొంతం కాదనీ ప్రతి ఒక్కరికీ చెందిన వ్యక్తి అని ఆయన గుర్తు చేశారు. పైగా విజయకాంత్ పేరు అవసరాలకు ఉపయోగించుకునేది కాదన్నారు.

చిన్నారులను అలరించేలా 'అళగర్ యానై'



'అళగర్ యానై' మూవీ పూజా దృశ్యం

చిన్నారులను ఆలరించేలా 'అళగర్ యానై' అనే పేరుతో ఓ చిత్రం రూపుదిద్దుకోనుంది. గతంలో వచ్చిన 'నల్ల నేరం', 'అన్నై ఓర్ ఆలయం' వంటి బాలల చిత్రాల తరహాలోనే ఈ సినిమా తెరకెక్కించనున్నారు. ఈ మూవీ పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. ఎస్వీ ప్రొడక్షన్స్ పతాకంపై శివశంకర్ నిర్మాణంలో మంగళేశ్వరన్ దర్శకత్వంలో రూపొందనుంది. విజయ్ టీవీ ఫేం పుగళ్ హీరోగా నటిస్తున్నారు. ఇతర పాత్రల్లో విశ్వమియా, నందిని, ఆర్యన్, బాల నటులు కారుణ్య, గోకుల్ తదితరులు నటించనున్నారు. వీరితోపాటు ఏనుగు కూడా ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించనుంది. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ సృష్టిలోని పంపభూతాలు ఏ విధంగా ప్రతి ఒక్కరికీ సమానమైనవో.. అదేవిధంగా ప్రేమాభిమానాలు సమానమని తెలిపేలా ఈ సినిమా కథ సాగుతుంది. గంగకొండ చోళపురంలో 169 అడుగులు ఎత్తైన ఏనుగు విగ్రహం ఉంది. రాజేంద్ర చోళుడు విజయం తర్వాత ఈ ఏనుగు విగ్రహాన్ని ప్రతిష్ఠించి, అళగర్ యానై అనే నామకరణం చేశారు. అలాంటి నమ్మకాన్ని కలిగించేలా ఈ మూవీకి 'అళగర్ యానై' అనే పేరు పెట్టాం. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తాం' అని వివరించారు.

'ఆండవన్' మహేశ్వరన్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న మహేశ్వరన్

సీనియర్ నటుడు కె.భాగ్యరాజ్‌తో కలిసి 'ఆండవన్' చిత్రంలో హీరోగా నటించిన మహేశ్వరన్‌కు డెబ్యూ హీరో గా ఉత్తమ అవార్డు వరించింది. ఈ అవార్డును సహ నటులు కేపీవై బాలా, ఆరంతాంగి నిషా వంటి వారి చేతుల మీదుగా స్వీకరించారు. మదురైకు చెందిన సేవన్ గ్రూపు, విస్సీ ఈవెంట్ ఆధ్వర్యంలో మదురైలో ఒక సంగీత విభావరిని తాజాగా నిర్వహించింది. ఇందులో సేవన్ గ్రూపు ఈ అవార్డుకు మహేశ్వరన్ పేరును ఎంపిక చేయగా, ఇదే కార్యక్రమంలో పాల్గొన్న అనేక మంది సినీ నటులంతా కలిసి ఆయనకు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా రామనాథపురం సంస్థానాధీశుడు రాజా నాగేంద్ర సేతుపతి, మదురై టెంపుల్ సిటీ వ్యవస్థాపకుడు కుమార్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.



'వినాయక' సందడి

నగరంలో మంగళవారం ఎక్కడ చూసినా గణనాథుడి వేడుకల కోలాహలం కనిపించింది. విగ్రహాల కొనుగోలు, తరలింపు హడావిడి జాతరను తలపించింది. ముఖ్యంగా మంగళంలోని వినాయక విగ్రహాలను విక్రయించే బొమ్మలక్వార్టర్స్ ప్రాంతంలో చవితి కళ ప్రస్ఫుటమైంది. మూడు వీధుల దుకాణాల్లో కొనుగోలుదారుల జోరు ఉత్సవ సందడికి అద్దం పట్టింది. కొద్ది గంటల్లో చవితి సమీపించనుండటంతో నిర్వాహకులు వడివడిగా విగ్రహాలను మండపాలకు చేర్చి కొలువుదీర్చే పనిలో మునిగిపోయారు. వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న విగ్రహాల్లో సింహభాగం అమ్ముడుపోవడంతో తయారీదారులు ఆనందం వ్యక్తం చేశారు. తిరుపతి, శెట్టిపల్లి, రేణిగుంట, కరకంబాడీ మీదుగా విగ్రహాలను తరలిస్తూ వాహనాలు క్యూకట్టాయి.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

మంగళవారం సాయంత్రం తిరుపతి గాంధీ రోడ్డులో రద్దీ











వినాయక విగ్రహాలకు ఫైనల్ టచ్



విగ్రహాల తరలింపు

ఫీల్డ్ అసిస్టెంట్ డిస్మిస్

కోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోట ఫీల్డ్ అసిస్టెంట్ పద్మమ్మను డిస్మిస్ చేస్తూ డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఆమెను పలు ఆరోపణలతో మండల అధికారులు విధుల నుంచి పాక్షికంగా తప్పించారు. మంగళవారం పూర్తిగా తొలగిస్తూ డ్వామా పీడీ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో వేణు తెలిపారు.

చీటింగ్ కేసులో జర్నలిస్టు అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రమాదేవి ఆసుపత్రి పరిపాలనా అధికారి, సూరింటెండెంట్‌ను బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలో పరారీలో వున్న జర్నలిస్టు మాచర్ల శ్రీనివాసులను అరెస్టు చేసినట్లు తిరుపతి వెస్ట్ సీఐ మురళీమోహన్ మంగళవారం తెలిపారు. ఇతడిపై అలిపిరి పోలీసుస్టేషన్‌లో మరో కేసు నమోదై వున్న విషయం విదితమే. దీంతో అతడి కోసం దాదాపు నాలుగు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. తిరుపతి, విజయవాడ, నెల్లూరు, కడప తదితర ప్రాంతాల్లో గాలించారు. మంగళవారం తిరుపతిలోని స్నేహితుల ఇంటి వద్ద ఉన్నట్లు తెలిసి సీఐ మురళీమోహన్ అతడిని అదుపులోకితీసుకుని అరెస్టు చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

ముగిసిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు

- పది క్రీడాంశాల్లో విన్నర్స్, రన్నర్స్‌కు సర్టిఫికెట్ల ప్రదానం

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మూడు రోజులపాటు నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ కప్ రాష్ట్రస్థాయి పోటీలు మంగళవారం ముగిశాయి. పది క్రీడాంశాల్లో జరిగిన పోటీల్లో విన్నర్స్, రన్నర్స్‌కు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈనెల 29న విశాఖలో జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో విజేతలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పతకాలు ప్రదానం చేయనున్నారు. ముగింపు కార్యక్రమంలో తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలో ఛాలెంజ్‌గా తీసుకొని మూడు రోజులుగా రాష్ట్రస్థాయి పోటీలు దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో విజేతలు ఒలింపిక్, కామన్‌వెల్త్, ఏసియన్ గేమ్స్‌లో రాణించి దేశం గర్వించేలా పతకాలు సాధించాలని కోరారు. నాలుగు జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, ఎస్వీయూ, మహిళా వర్శిటీలలో బస ఏర్పాటు చేశామన్నారు. రవాణా, ఇతర ఏర్పాట్లు కల్పించడంతో ఎక్కడా లోటుపాట్లు, ఫిర్యాదులు అందలేదన్నారు. తిరుపతిలో మరింత పెద్దస్థాయిలో క్రీడలు నిర్వహించుకునే అవకాశం ఈ పోటీల ద్వారా నిరూపితమైందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనరు మౌర్య, శాప్ డైరెక్టర్లు రజని, సంతోష్, అధికారులు కోటేశ్వరరావు, శశిధర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



ఆర్చరీకి సంబంధించి ఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

జిల్లాల వారీగా విన్నర్స్, రన్నర్స్ వివరాలిలా..

హాకీ: పురుష విభాగంలో తిరుపతి, కాకినాడ.. మహిళా విభాగంలో అనకాపల్లి, కాకినాడ జిల్లాలు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి.

అథ్లెటిక్స్: పురుష విభాగంలో శ్రీకాకుళం, కాకినాడ, పల్నాడు, కడప విన్నర్స్‌గాను.. అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్), పల్నాడు, కడప రన్నర్స్‌గా నిలిచాయి. మహిళా విభాగంలో విజయనగరం, అనకాపల్లి, కడప విన్నర్స్‌గాను.. విజయనగరం, కాకినాడ, గుంటూరు, కడప రన్నర్స్‌గా నిలిచాయి.

షటిల్ బ్యాడ్మింటన్: పురుష విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండింటిలోనూ కోనసీమ విన్నర్స్‌గా.. సింగిల్స్‌లో ఎన్టీఆర్, డబుల్స్‌లో పశ్చిమగోదావరి రన్నర్స్‌గా నిలిచాయి. మహిళా విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండింటిలోనూ విన్నర్స్‌గా ఎన్టీఆర్ జిల్లా నిలవగా.. రన్నర్స్‌గా సింగిల్స్‌లో కడప, డబుల్స్‌లో ఎన్టీఆర్ నిలిచాయి.

బాస్కెట్‌బాల్: పురుష విభాగంలో చిత్తూరు, కడప.. మహిళా విభాగంలో ఏలూరు, వైజాగ్ విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి.

బాక్సింగ్: పురుష విభాగంలో విన్నర్స్‌గా వైజాగ్, శ్రీకాకుళం, ఎన్టీఆర్, గుంటూరు, తిరుపతి.. రన్నర్స్‌గా తిరుపతి, అనంతపురం, కర్నూలు, ఉభయ గోదావరి జిల్లాలు, కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్, శ్రీకాకుళం నిలిచాయి. మహిళా విభాగంలో విన్నర్స్‌గా వైజాగ్, అనకాపల్లి, రన్నర్స్‌గా ఉభయగోదావరి, తిరుపతి, అనంతపురం, ఎన్టీఆర్ జిల్లాలు ఉన్నాయి.

కబడ్డీ: పురుష విభాగంలో కాకినాడ గెలుపొందగా.. అనంతపురం రెండో స్థానంలో నిలిచింది. మహిళా విభాగంలో విన్నర్స్ ఎన్టీఆర్, రన్నర్స్ శ్రీకాకుళం జిల్లాలు

ఖో-ఖో: పురుష విభాగంలో విన్నర్స్ గుంటూరు, రన్నర్స్ వైజాగ్. మహిళా విభాగంలో విన్నర్స్ కాకినాడ, రన్నర్స్ వైజాగ్

వాలీబాల్ : పురుష విభాగంలో విన్నర్స్ మన్యం, రన్నర్స్ తిరుపతి. మహిళా విభాగంలో విన్నర్స్ ఎన్టీఆర్, రన్నర్స్ వైజాగ్

వెయిట్ లిఫ్టింగ్ : పురుష విభాగంలో విన్నర్స్ వైజాగ్, అనకాపల్లి, కడప, గుంటూరు, వైజాగ్, గుంటూరు, బాపట్ల, పశ్చిమగోదావరి, కడప, కర్నూల్. మహిళా విభాగంలో విన్నర్స్ కాకినాడ, రన్నర్స్ వైజాగ్.

ఆర్చరీ: పురుష విభాగంలో విన్నర్స్ తిరుపతి, గుంటూరు.. రన్నర్స్ గుంటూరు, కాకినాడ, తిరుపతి. మహిళా విభాగంలో విన్నర్స్ వైజాగ్, కాకినాడ, గుంటూరు.. రన్నర్స్ తిరుపతి, గుంటూరు.

ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరిది?

- మఠం భవనం కూల్చివేయండి
- ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలోనున్న పురాతన మఠం భవనం కూలిపోయి ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ప్రశ్నించారు. ఐఐటీ నిపుణులు సూచించిన మేరకు ఈ భవనాన్ని కూల్చివేయాలని డిమాండు చేశారు. తిరుపతి నగరం గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం భవనాలను మంగళవారం స్వామీజీలు, హిందూ సంఘాల నాయకులతో కలిసి పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. నాటి ప్రతిపాదనలకు అనుగుణంగా భవనం కూల్చడానికి టెండర్లు కూడా నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే స్వార్థ రాజకీయాలు ప్రవేశించి శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనాన్ని కూల్చకూడదని కలెక్టర్‌పై ఒత్తిడి తెస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దాని కోసం ఈ మఠం భవనాల విషయంలో సాగదీత కొనసాగిస్తున్నారని చెప్పారు. కూల్చకూడదనే అభిప్రాయం ఉంటే అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ భవనంలో నెల రోజులు ఉండడం ద్వారా ప్రమాదం లేదని నిరూపించాలని సూచించారు. కలెక్టర్ స్పందించి రాజకీయాలకు అతీతంగా భవన శిథిల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రమాదం సంభవించక ముందే భవనాన్ని కూల్చివేయాలని కోరారు. భవనం గదుల్లో ఉండే దుకాణదారులు నష్టపోకుండా న్యాయం చేయాలన్నారు. ఏపీ సాధు పరిషత్ గౌరవ అధ్యక్షులు అట్లూరి నారాయణరావు, శివానంద స్వామి, తుమ్మ ఓంకార్, రమాదేవి,జెన్ కిరణ్,నీలకంఠ, చంద్రమౌళి,సురేష్ నాయక్, పుష్పలత, వెంకటేష్, సుధాకర్ చౌదరి,హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మట్టితో గణపతులు.. చిట్టిచేతుల అద్భుతం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వందల మంది చిన్నారులు తమ చేతులతో మట్టి గణపతి రూపాలను అద్భుతంగా తీర్చిదిద్ది ఆశ్చర్యపరిచారు. వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల తయారీపై పాఠశాల విద్యార్థులకు ఏజీఎస్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం పోటీలు నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలలకు చెందిన సుమారు 700 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ పంపిణీ చేసిన మట్టి ముద్దలతో రకరకాల రూపాలతో గణపతి ప్రతిమలు దర్శనమిచ్చాయి. ఈ మట్టి ప్రతిమలను పరిశీలించి విద్యార్థులను నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అభినందించారు. విజేతలకు ప్రశంసాపత్రాలను, మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.వినాయక సాగర్‌లో నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, అధికారులు సూచించిన మార్గాల్లో తరలివచ్చి నిమజ్జనాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, చెన్నం నవీన్, ఎస్వీఎం వెంకటేష్, కరాటి శ్రీనివాస్, సుబ్రమణ్యంరెడ్డి, చెంగారెడ్డి, వాసు, గోపి, ప్రసాద్, డీపీ ఆనంద్, డాక్టర్ నరేష్, నాగేశ్వరరావు, రఘురామిరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.







విజేతలకు మొక్కలు అందిస్తున్న కమిషనర్,ఉత్సవ కమిటీ సభ్యులు


పెద్ద వినాయక విగ్రహాల పంపిణీ

తిరుపతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల్లోని పల్లెలకు మంగళం బొమ్మల క్వార్టర్స్ వద్ద 960 పెద్ద వినాయక విగ్రహాలు పంపిణీ మంగళవారంతో పూర్తయింది. ట్రస్ట్ నిర్వాహకుడు జాతీయ టూరిజం మాజీ బోర్డు డైరెక్టర్ సురేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ నిత్యం వినాయక స్వామి ఆరాధనలో వున్న తనకి స్వామి ఆశీస్సులు వెన్నంటే నిలిచాయన్నారు. 50 విగ్రహాలనుంచి వెయ్యి విగ్రహాలు ఇచ్చే శక్తిని స్వామి అనుగ్రహించారన్నారు. గతంలో శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి, నగరి, చంద్రగిరి, గంగాధర నెల్లూరు నియోజకవర్గాలలోని పలు గ్రామాలకు ఇచ్చేవాడినని చెప్పారు. పర్యావరణ హిత విగ్రహాలనే అందిస్తామన్నారు. జనసేన నేత కిరణ్ రాయల్ మాట్లాడుతూ దాదాపు పాతికేళ్లుగా ఏడాదికి పాతికలక్షలు పైగా ఖర్చుపెట్టి ఉచితంగా విగ్రహాలు పంపిణీ చేయడం సురేంద్రకుమార్ రెడ్డికే సాధ్యమన్నారు.



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న సురేంద్రకుమార్ రెడ్డి, జనసేన నేత కిరణ్ రాయల్ తదితరులు

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.07 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,767

తలనీలాలు సమర్పించినవారు: 25,852

తిరుమలలో ప్రముఖులు



తిలక్ వర్మ - వెంకీ కుడుముల, మల్లాది వశిష్ట - గంగై అమరన్

తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సినీ దర్శకులు వెంకీ కుడుముల, మల్లాది వశిష్ట, సంగీత దర్శకుడు గంగై అమరన్ ఉన్నారు. అలాగే బీఏపీఎస్ సామి నారాయణ్ సంస్థకు చెందిన సాధు బ్రహ్మవిహారి స్వామిజీ 70 మంది శిష్య బృందంతో శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం శ్రీవారి పుష్కరిణికి చేరుకుని ధ్యానం చేశారు.



శ్రీవారి పుష్కరిణిలో శిష్య బృందంతో బ్రహ్మవిహారి స్వామిజీ

తిరుమలలో కూలిన చెట్టు

- సెక్యూరిటీ గార్డుకు గాయాలు



తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం ఉదయం ఓ భారీ వృక్షం కూలడంతో సెక్యూరిటీ గార్డు గాయపడ్డాడు. ఎంబీసీ 34 వద్ద గాలికి చెట్టుకూలడంతో బైక్‌పై వెళుతున్న టీటీడీ సెక్యూరిటీ గార్డు చంద్రశేఖర్ రెడ్డి గాయపడ్డాడు. ఆయనను అశ్విని ఆస్పత్రికి తరలించారు.

మొదటిఘాట్‌లో ఊడిన బస్సు చక్రం

- ప్రమాణికులు సురక్షితం



తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో మంగళవారం ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. 25 మంది ప్రయాణికులతో తిరుపతికి బయలుదేరిన బస్సు 55వ మలుపు వద్ద మెయిన్ రాడ్డు నుంచి చక్రం విడిపోయి కిందకు వంగిపోయింది. డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

డ్యూటీ అయ్యాక కిందకి దిగేయాల్సిందే!

- హోటళ్లు, దుకాణాల్లోని కార్మికులను ఆదేశించిన పోలీసులు



హాకర్లు, కార్మికులు, యాచకులను తిరుపతికి తరలిస్తున్న పోలీసులు

తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో దుకాణాలు, హోటళ్లు, టీ దుకాణాల్లో పనిచేసే కార్మికులు వారి విధులు పూర్తికాగానే తిరుపతికి వెళ్లిపోవాలని పోలీసులు ఆదేశించారు. ఈ బాధ్యతను యజమానులే తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో టీటీడీ విజిలెన్స్, తిరుమల పోలీసులు మంగళవారం పలు ప్రదేశాల్లో తనిఖీలు చేసిన తర్వాత ఈ సూచనలు చేశారు. సాధారణ భక్తుల కోసం తిరుమలలో ఏర్పాటు చేసిన వసతి సముదాయాలు, షెడ్లలో కార్మికులు ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. అనధికారికంగా 75 మంది హాకర్లు, కార్మికులు, యాచకులు ఇలా ఉంటున్నారని గుర్తించి ఈ ఆదేశాలు జారీ చేశారు. వారిని తిరుమల నుంచి తిరుపతికి తరలించారు.

1 నుంచి తిరుపతి-మదనపల్లి రోడ్డు వరకు ప్రత్యేక రైలు

తిరుపతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సెప్టెంబరు1 నుంచి 30వ తేది వరకు ప్యాసింజర్ రైలును నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07262) ఉదయం 4.10 గంటలకు బయలుదేరి 7.15 గంటలకు మదనపల్లిరోడ్డు రైల్వే స్టేషన్‌కు చేరుకొంటుంది. తిరిగి మదనపల్లిరోడ్డు స్టేషన్‌లో ఈ ప్రత్యేక రైలు(07261) మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలు తిరుపతి నుంచి పాకాల, పీలేరు, కలికిరి స్టేషన్ల మీదుగా మదనపల్లిరోడ్డు స్టేషన్ వరకు రాకపోకలు సాగిస్తుంది.

- తిరుపతి-మన్నార్‌గుడి పామని ఎక్స్‌ప్రెస్‌కు రెండు ఏసీ కోచ్‌లు

తిరుపతి-మన్నార్‌గుడి మధ్య రాకపోకలు నిర్వహించే పామని ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 4, 5 తేదీల్లో రెండు ఏసీ చైర్ కార్ కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఆర్వో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆరు రోజుల క్రితం బంగారు నగల కోసం ఒక వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు స్థానిక కొరమేనుగుంటలోని సీపీఆర్ అపార్టుమెంటులో కాపురమున్న ధనలక్ష్మి నిద్రపోతున్న సమయంలో ఇంటిలో పని చేస్తున్న విజయవాడకు చెందిన బందేల రవి కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం ఇంటిలో వున్న చీర కట్టుకుని గుర్తుపట్టని విధంగా పారిపోయాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేసిన సీఐ రాంకిషోర్, ఎస్ఐలు లోకేష్‌బాబు, నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటుచేశారు. ఘటనా స్థలం నుంచి సేకరించిన సీసీ ఫుటేజీల ఆధారంగా స్థానిక ఆటోనగర్ బస్టాపు వద్ద ఉన్నాడనే సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు మధ్యవర్తుల ఆధ్వర్యంలో రవిని అరెస్టు చేశారు. నిందితుడు రవిపై నేర చరిత్ర వున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వృద్ధురాలి మెడ నుంచి అపహరించుకెళ్లిన బంగారు కమ్మలను స్వాధీనం చేసుకున్నారు.